సాక్షి శ్రీకాకుళం

శనివారం । 6 । జనవరి । 2024

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో శనివారం డయల్ యువర్ వర్సిటీ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమస్యలు, సందేశాలు, సూచనలు, వర్సిటీకి సంబధించిన ఇతర సమాచారం తెలుసుకునేందుకు 82478 61919 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు రేపు



చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యా శాఖాధికారులు

టెక్కలి: శ్రీకాకుళంలో ఆదివారం చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం టెక్కలిలో ఉప విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ, ఎంఈఓలు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల స్థాయిలో విజేతలైన వారంతా హాజరు కావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హోంగార్డుకు రూ. 4.20 లక్షల వేతన చెక్కు



రూ. 4.20 లక్షల చెక్కును హోంగార్డు కృష్ణమూర్తికి అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధిక హోంగార్డు ఎల్.కృష్ణమూర్తికి శుక్రవారం రూ. 4.20 లక్షల చెక్కును అందజేశారు. జిల్లా హోంగార్డు విభాగంలో ఉన్న కృష్ణమూర్తి నందిగాం మండలం పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తూ గత నెలలో ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా హోంగార్డుల ఒక్క రోజు వేతనాన్ని చెక్కు రూపంలో ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డుగా రిటైర్ అయినప్పటికీ పోలీసు శాఖలో భాగమని, భవిష్యత్‌లో ఎలాంటి అవసరం ఉన్నా జిల్లా పోలీసు శాఖ అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ ఆర్ఐ కేవీ నర్సింగరావు ఉన్నారు.

టూరిస్టు బస్సుకు తప్పిన ప్రమాదం



చలిలో వృద్ధులు

శ్రీకాకుళం క్రైమ్, రూరల్ : జిల్లాకేంద్రానికి ఆనుకొని ఉన్న పెద్దపాడు సమీపంలో ఓ టూరిస్టు బస్సుకు శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. రాజస్థాన్ నుంచి పూరి జగన్నాథ స్వామి ఆలయాన్ని సందర్శించి తిరుమల, శ్రీశైలం వెళ్లేందుకు 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు శ్రీకాకుళం సమీపానికి 7.45 గంటలకు చేరుకుంది. పెద్దపాడు అప్పన్నమ్మ కోవెల వద్ద భోజనాల కోసం డ్రైవర్ బండిని పక్కకు తీయగా.. డ్రైనేజీ పలకలు విరిగి బస్సు టైర్లు కాలువలోకి దిగిపోయాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ నెమ్మదిగా బండిని ఆపడంతో ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న వారంతా వృద్ధులే. చలిలో గంటన్నరకు పైగా వేచి ఉన్నారు. చైన్ పొక్లెయినర్ వచ్చి బస్సును బయటకు తీసింది.

అంగన్‌వాడీ ఆయాపై దాడి

శ్రీకాకుళం రూరల్: అంగన్‌వాడీ తెరిచిన ఓ ఆయాపై కొందరు అంగన్‌వాడీ సిబ్బంది దాడికి దిగారు. రాగోలు ఎస్సీ కాలనీ సెక్టార్‌లో పని చేస్తున్న ఆయా తులసమ్మ శుక్రవారం అంగన్‌వాడీ తెరిచి పిల్లలకు భోజనం పెట్టారు. అయితే అంతలోనే ఆమదాలవలస ప్రాజెక్టుకు సంబంధించిన లీడర్లు లలితాదేవి, భూలక్ష్మీతో పాటు మరో 20 మంది రెండు ఆటోల్లో వచ్చి ఆయాపై దాడికి తెగబడ్డారు. పిల్లలు తింటున్న ఆహారాన్ని, కేంద్రంలో వంట సామగ్రిని చెల్లాచెదురు చేసి నానా రభస సృష్టించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసింది.

పింఛన్ల కథ.. అపురూపం కదా..!



కొత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీ సందర్భంగా లబ్ధిదారుల సమక్షంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

రూ.3వేలు పింఛన్ అందిన ఆనందంతో ఓ వృద్ధుడు మంత్రిని ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. పెన్షన్ డబ్బు ఇంటి వద్దనే అందుకున్న సంతోషంలో మరో వృద్ధుడు ముఖ్యమంత్రిని 'నా మనవడు' అంటూ అనురాగం కురిపించారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన నాయకుడి చిత్రపటానికి ఊరంతా కలిసి పాలతో అభిషేకించారు. పింఛన్ల పంపిణీ పల్లెపల్లెనా ఇలాంటి కొత్త కథలను పరిచయం చేస్తోంది. ఒక సంక్షేమ పథకం సక్రమంగా అమలైతే పేద బతుకులెంతగా ఆనందపడతాయో ప్రపంచానికి చూపిస్తోంది. – సాక్షి నెట్‌వర్క్, శ్రీకాకుళం





జగన్‌ను మళ్లీ గెలిపిస్తాం..



కిందటి టీడీపీ ప్రభుత్వంలో రోజుల తరబడి తిరిగితే తప్ప చేతికి పింఛన్ అందేది కాదు. నా మనవడు వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వృద్ధాప్య పింఛన్ ఇంటి వద్దకే పంపుతున్నాడు. ఈ నెల రూ.3వేలు అందింది. మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం. ఇచ్చిన మాట తప్పకుండా పింఛన్ మొత్తం పెంచారు. ఇలాంటి ముఖ్యమంత్రి మళ్లీ రావాలని కోరుకుంటున్నాం.

– మండల జగన్నాథం, నీలాదేవిపురం, బూర్జ మండలం

ఈ వృద్ధుడి పేరు కొనపల తవిటయ్య. రూ.3వేలు పింఛన్ అందుకున్న ఆనందాన్ని ఉద్వేగంగా మంత్రి సీదిరితో కలిసి ఇలా పంచుకున్నారు. తన ఇంటిలో సీఎం వైఎస్ జగన్ ఫొటోలు కూడా పెట్టుకున్నానని ఉద్వేగంగా చెప్పారు. పలాసలోని పురుషోత్తపురంలో శుక్రవారం నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఈ అపురూప దృశ్యం కనిపించింది. - కాశీబుగ్గ

అర్హులకు న్యాయం



లబ్ధిదారులకు మోడల్ చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

- పథకాల లబ్ధి పొందని 2143 మంది అర్హులకు రూ.3.12 కోట్లు జమ

నవరత్నాలు ద్వైవార్షిక పథకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్హత ఉండి కూడా పథకం అందుకోలేకపోయిన వారిని ప్రభుత్వం ఆదుకుంది. అన్ని పథకాల లబ్ధిదారుల జాబితాలను నిశితంగా పరిశీలించి మరీ నగదు అందుకోని అర్హులను ఎంపిక చేసి వారికి నవరత్నాలు – ద్వైవార్షిక పథకం కింద రావాల్సిన నగదును వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి వారి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హత ఉండి వివిధ కారణాలతో నవరత్నాలు అందని 2143 మందికి ఈ రోజు రూ. 3,11,64,678 లు వారి ఖాతాల్లో జమ కానున్నాయని అన్నారు. కొత్తగా మరో తొమ్మిది వేల మందికి వివిధ పెన్షన్లు మంజూరు చేశామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియ విజయ, నరసన్నపేట ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, సుడా చైర్‌పర్సన్ కోరాడ ఆశాలత, పొందర కూరాకుల, శ్రీశయన కార్పొరేషన్ చైర్ పర్సన్లు రాజాపు హైమావతి, డీపీ దేవ్, డీఆర్‌డీఏ పీడీ డీవీ విద్యాసాగర్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గెడ్డమ్మ, సచివాలయాల నోడల్ అధికారి పి.వాసుదేవ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయం

- 3677 మందికి వైద్య సేవ

జగనన్న ఆరోగ్య సురక్ష

అరసవల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలు శుక్రవారం జిల్లాలో 13 మండలాల్లోని గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత వైద్య పరీక్షల శిబిరాలు, ఉచిత మందుల పంపిణీ చేశారు. మొత్తం 3677 మంది గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య సేవలు పొందారు. జిల్లాలో హిరమండలం పీహెచ్‌సీ పరిధి హిరమండలం-2 సచివాలయంలో, ఎంఎస్ పల్లి పీహెచ్‌సీ పరిధి జాడుపూడి సచివాలయంలో, బెలగాం పీహెచ్‌సీ పరిధి లండరపుట్టుగ సచివాలయంలో, తిలారు పీహెచ్‌సీ పరిధి కస్తూరిపాడు సచివాలయంలో, లావేరు పీహెచ్‌సీ పరిధి లావేరు-2 సచివాలయంలో, మెళియాపుట్టి పీహెచ్‌సీ పరిధి వెంకటాపురం సచివాలయంలో, నందిగాం పీహెచ్‌సీ పరిధి దిమిలాడ సచివాలయంలో, వెంకటాపురం పీహెచ్‌సీ పరిధి టెక్కలి పట్నం సచివాలయంలో, గంగువాడ పీహెచ్‌సీ పరిధి తిడ్డిమి సచివాలయంలో, పాతర్లపల్లి పీహెచ్‌సీ పరిధి చిల్లపేట రాజాం సచివాలయంలో, బోరుబద్ర పీహెచ్‌సీ పరిధి దిమిలాడ సచివాలయంలో, మాణిక్యపురం పీహెచ్‌సీ పరిధి సోంపేట-1 సచివాలయంలో, లింగాలవలస పీహెచ్‌సీ పరిధి లింగాలవలస సచివాలయంలో జెఎఎస్ -2 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించగా, మొత్తం నలుగురు వైద్యుల బృందం ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా ఏడు రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా 91 రకాల మందులను పంపిణీ చేశారు. ప్రతి మెడికల్ క్యాంపులోనూ ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ఆప్తాలమిక్ వైద్యునితో కలిసిన బృందం ఆధ్వర్యంలో బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, టీబీ, మలేరియా, టైఫాయిడ్‌ల నిర్ధారణకు రక్త పరీక్షలు, థైరాయిడ్ వంటి ఏడు రకాల పరీక్షలు నిర్వహించారు.



టెక్కలి: లింగాలవలస గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వివిధ రక్త పరీక్షలు చేసుకుంటున్న గ్రామాల ప్రజలు

శుక్రవారం ఇలా..	వైద్య శిబిరాలు	ఓపీ రిజిస్ట్రేషన్	రిఫరల్స్	మందుల పంపిణీ	కళ్లకు స్క్రీనింగ్
	13	3677	12	3677	365

పాలన వికేంద్రీకరణతో సత్ఫలితాలు

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



గ్రామ సచివాలయాలను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: పరిపాలన వికేంద్రీకరణతో సత్ఫలితాలు అందుతున్నాయని రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండల పరిధిలోని రాగోలు-1లో నూతన సచివాలయాలను ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా ప్రభుత్వాలు ప్రజల వద్దకు పాలన తీసుకువస్తాయని మాటలు చెప్పాయే గానీ అమలు చేయలేకపోయాయని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే సచివాలయ వ్యవస్థ వచ్చిందని తెలిపారు. గతంలో ఏ పని కావాలన్నా సంబంధిత కార్యాలయానికి వెళ్లి వ్యయ ప్రయాసలకు గురయ్యేవాళ్లమని, ఇప్పుడు అవే పనులు సులభంగా జరుగుతున్నాయని వివరించారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో రూ.500 కోట్లు పెట్టి 20 వేల మందికి ఇంటి పట్టాలు అందించామన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో ఎక్కడైనా సెంటు భూమి ఇచ్చారా అని సూటిగా ప్రశ్నించారు. భవిష్యత్ తరాలు బాగుండాలన్నా, పేద ప్రజల కష్టాలను తీర్చాలన్నా అది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనువాసరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ అంబటి నిర్మల, మండల పార్టీ అధ్యక్షులు మూకళ్ల తాతబాబు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు కృష్ణ, సర్పంచ్ గేదెల శంగల్వరావు, బగ్గు అప్పారావు, గుండ మోహన్, చిట్టి రవికుమార్, పొన్నాన కూర్మారావు, శార్వాణి తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ పనుల పరిశీలన నేడు



హార్బర్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలం

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెంలో ప్రభుత్వం నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనుల పరిశీలనకు కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖామంత్రులు పురుషోత్తం రూపాల, డాక్టర్ ఎల్.మురుగన్ శనివారం రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా మత్స్య శాఖ కావాల్సిన ఏర్పాట్లు చేసింది. ఈ పరిశీలనకు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుతో పాటు పలువురు అధికారులు వస్తున్నారు. మత్స్యకారుల వలసల నిర్మూలన, జీవనోపాధుల కల్పన దిశగా ఈ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారు. రూ. 365.81 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నారు. కాంట్రాక్టు సంస్థ పనులు సైతం ప్రారంభించింది.

2023 ఏప్రిల్ 19వ తేదీన మూలపేట పోర్టు శంకుస్థాపనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్‌గా ఈ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మత్స్యశాఖ అధికారులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. మొత్తం 42 ఎకరాలు కేటాయించారు. ప్రస్తుతం అంతర్గత రోడ్లు నిర్మిస్తున్నా రు. పూర్తిస్థాయి లేవుట్‌ను తీర్చిదిద్దుతున్నారు. లూజ్ సోయిల్ కావటం వల్ల ముందుగా రాళ్లతో నిర్మాణం చేపట్టి, అనంతరం తారు, సిమ్మెంట్ రోడ్లు నిర్మించనున్నారు. ఫిషింగ్ హార్బర్ డిజైన్ మేరకు చురుగ్గా పనులు సాగుతున్నాయి. స్థానిక ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో వేట ఆధారంగా జీవనం సాగించే మత్స్యకారులు ఈ హార్బర్ నిర్మాణం కో సం ఎదురు చూస్తున్నారు. స్థానిక మత్స్యకారులకు ఈ సందర్భంగా కిసాన్ క్రెడిట్ కార్డ్ లోన్, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నారు.

'సత్యనారాయణ త్యాగం నిరుపమానం'



అంగీకార పత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: తెలుగు రాష్ట్రాల్లో పేరున్న ఆర్థోపెడిక్ సర్జన్ ఏవీ గురవారెడ్డి తండ్రి డాక్టర్ అన్నపరెడ్డి సత్యనారాయణ మృత దేహాన్ని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి అప్పగించారు. ఇక్కడ వైద్య విద్యార్థుల శిక్షణ కోసం మృతదేహాన్ని అందించడం ఎంతో గొప్ప విషయమని జెమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత శుక్రవారం తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన హార్ట్ ఎటాక్‌తో మృతి చెందగా శుక్రవారం ఆయన పార్థివ దేహాన్ని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గల మెడికల్ కళాశాల విద్యార్థుల శిక్షణ కోసం అప్పగించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు సత్యనారాయణ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన కుమారులు డాక్టర్ ఏవీ గురువారెడ్డి, హరిహర ప్రసాద్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డి, అడిషనల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ రవితేజ, ఆర్‌ఎంఒ బాలమురళీ, ప్రవీణ్, ఆపరేషన్ మేనేజర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

ఏసీఏ నార్త్‌జోన్ జట్టుకు నలుగురు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ నార్త్‌జోన్-14 బాలుర క్రికెట్ జట్టుకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. తుది జట్టుకు కె.క్రాంతికుమార్, సీహెచ్ రోహిత్, వివేకానంద, స్టాండ్‌బైగా ఎస్.సాత్విక్ ఎంపికయ్యారు. తాజాగా జరిగిన నార్త్‌జోన్ క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జిల్లా తరఫున వీరు రాణించడంతో ఛాన్స్ లభించిందని జిల్లా క్రికెట్ సంఘ బాధ్యులు వైఎస్ శాస్త్రి, హసన్‌రాజా, కేఎస్ఎం శైలానీ తెలిపారు. వీరంతా మంగళగిరి వేదికగా ఈనెల 7 నుంచి మొదలుకానున్న ఏసీఏ అంతర్‌జోనల్ అండర్-14 బాలుర క్రికెట్ టోర్నీలో నార్త్‌జోన్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు నలుగురు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా నేషనల్స్ స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి రికార్డు స్థాయిలో నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్‌లోని బిటిమిన్ వేదికగా జరగనున్నాయి. జాతీయ స్కూల్‌గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనవారిలో అండర్-17 బాలురు జట్టుకు ఎం.యశ్వంత్ (జెడ్పీహెచ్‌స్కూల్ కేశవరావుపేట), ఎస్.మధుసూదనరావు (జెడ్పీహెచ్‌స్కూల్ కేశవరావుపేట), వై.లక్ష్మీప్రసాద్ (శ్రీచైతన్య జూనియర్ కాలేజ్ శ్రీకాకుళం),బాలికల జట్టుకు పి.రేణుక (జెడ్పీహెచ్‌స్కూల్ కేశవరావుపేట) ఉన్నారు. వీరంతా ఈ పోటీల కోసం శుక్రవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు.

చట్టవిరుద్ధ లావాదేవీలపై దృష్టి



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : చట్ట విరుద్ధమైన, పరిమితికి మించిన అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై తప్పకుండా తమకు సమాచారం అందించాలని ఎస్పీ జీఆర్ రాధిక బ్యాంకు అధికారులను కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వివిధ బ్యాంకు అధికారులతో ఎస్పీ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంకు లావాదేవీలు, అక్రమ నగదు స్వాధీనంపై భారత ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు నగదు లావాదేవీలపై బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు. మరి కొద్ది రోజుల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున బ్యాంకుల్లో చట్టవిరుద్ధ లావాదేవీలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఏదైనా భారీ మొత్తం నగదు డిపాజిట్ చేసినా లేదా విత్‌డ్రా చేసినా, అలాంటి లావాదేవీలు అనుమానాస్పదంగా ఉంటే సంబంధిత అధికారులకు తప్పనిసరిగా సమాచారం తెలపాలన్నారు. పోలింగ్ తేదీకి ఆరు నెలల ముందు బ్యాంకుల ద్వారా ఏదైనా అసాధారణ ఆన్‌లైన్ లావాదేవీలు జరిగినా చెప్పాలన్నారు. బ్యాంకు లాకర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, బ్యాంకు, ఏటీఎం కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పించి సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షించాలన్నారు. లాకర్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలను ప్రతిరోజూ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ కె.బాలరాజు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

4,958 కొత్త బియ్యం కార్డుల మంజూరు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు కొత్తగా 4958 బియ్యం కార్డులు మంజూరయ్యాయని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో ప్రస్తుతం ఉన్న 6,70,325 కార్డుదారులకు ప్రతి నెలా బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తామని తెలిపారు. ద్వైవార్షిక పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులై ఉండి, ఆగస్టు, 2023 నుంచి డిసెంబర్ 2023 మధ్య కొత్త రైస్ కార్డు, కార్డు విభజన కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ కొత్త బియ్యం కార్డులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. వీరికి జనవరి నుంచి బియ్యం అందజేయనున్నట్లు తెలిపారు.

కొత్త కార్డులు

మండలం	కార్డులు	మండలం	కార్డులు
		కవిటి	164
శ్రీకాకుళం	406	టెక్కలి	154
ఎచ్చెర్ల	276	సారవకోట	150
నరసన్నపేట	268	కొత్తూరు	148
రణస్థలం	231	లావేరు	146
కోటబొమ్మాళి	205	ఆమదాలవలస	144
పలాస	191	మందస	144
గార	189	నందిగాం	142
పాతపట్నం	184	సంతబొమ్మాళి	136
పొలాకి	182	కంచిలి	109
సోంపేట	182	బూర్జ	93
జలుమూరు	180	మెళియాపుట్టి	89
పొందూరు	179	హిరమండలం	66
జి.సిగడాం	175	ఎల్ఎన్‌పేట	64
వజ్రపుకొత్తూరు	165	సరుబుజ్జిలి	63
		మొత్తం	4958

క్లుప్తంగా

భోజనంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి



మెస్‌లో భోజనం చేస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బాలాజీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: భోజనంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎం పురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధన బాలాజీ అన్నారు. ఆర్‌జీయూకేటీ మెస్‌ను శుక్రవారం ఆయన పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కాంట్రాక్టర్ టెండర్ల మేరకు మెనూ అమలు చేయాలని, పక్కాగా నాణ్యతతో కూడిన భోజనం పెట్టాలని అన్నారు. వార్డెన్లు, డిప్యూటీ వార్డెన్లు రోజూ భోజనం నాణ్యత పరిశీలించి, విద్యార్థుల నుంచి తీసుకున్న ఫీడ్ బ్యాక్ నివేదిక ఇవ్వాలని చెప్పారు. ఈ నివేదిక ఆధారంగా భోజన నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఉందని అన్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదు వస్తే మెస్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనతో పాటు ఏఓ మునిరామకృష్ణ, వసతి గృహం ఇన్‌చార్జిలు భోజనం చేశారు.

అగ్నికుల క్షత్రియ జిల్లా ఆత్మీయ కలయిక రేపు



హరిపురంలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అగ్నికుల క్షత్రియ నాయకులు

మందస: అగ్నికుల క్షత్రియుల జిల్లా ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. మందస మండలంలోని హరిపురంలో శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించి, పలువురు నాయకులకు అందజేశారు. సోంపేట మండలంలోని బారువా గ్రామంలో జరిగే ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు వస్తున్నట్లు తెలిపారు. అందరూ రావాలని కోరారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు మడియా రామకృష్ణ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు బత్తిని లక్ష్మణ్, యూత్ ఫోర్స్ అధ్యక్షుడు శివంగి వాసు, ఉద్దానం క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ, లబ్బ రుద్రయ్య, బత్తిని ఉమాపతి, తాళ్ల మురళీ, బత్తిని రామారావు, తెప్పల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మణిపాత్రుని కవితకు బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న మణిపాత్రుని నాగేశ్వరరావు

ఎచ్చెర్ల: మండలంలోని ముద్దాడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మణిపాత్రుని నాగేశ్వరరావుకు శుక్రవారం రాజమహేంద్రవరంలో జరిగిన రెండో అంతర్జాతీయ మహాసభలో తాను చదివిన తెలుగు తల్లిని కాపాడుదాం అనే కవితకు బంగారు పతకం దక్కింది. పొట్నూరు హరికృష్ణ, ఎస్ఆర్ఎస్ కొల్లూరి చేతుల మీదుగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బోగడెల ఉమామహేశ్వరరావు, డబ్బీరు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు కానుకగా వెండి త్రిశూలం



ఆలయ ఈవో రామారావుకు వెండి త్రిశూలాన్ని అందజేస్తున్న దాతలు, సినీ నటి కల్యాణి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన భక్తులు శుక్రవారం వెండి త్రిశూలాన్ని కానుకగా సమర్పించారు. సోంపేటకు చెందిన ములగాడ విజయలక్ష్మి, చిట్టిబ్బాయిల పేరిట కుటుంబ సభ్యులు కేజీ వెండితో తయారు చేయించిన త్రిశూలాన్ని ఆలయ ఈవో కేఎస్.రామారావుకు అందచేశారు. సినీ నటి పడాల కల్యాణి (కరాటే కల్యాణి) దాతలతో పాటు ఉన్నారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం తర్వాత అమ్మవారి ప్రసాదాలను అందించారు.

వస్తువుల్లో కళ.. విక్రయాలు భళా



మందస మండలం జగన్నాథ స్వామి స్వయం శక్తి సంఘం ఏర్పాటుచేసిన చెక్క బొమ్మలు

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌కు సందర్శకుల రాక పెరుగుతోంది. వస్త్రాలు, బొమ్మలు, పచ్చళ్లు వంటివి ఆకర్షిస్తుండడంతో నగర వాసులు వాటిని కొనుగోలుచేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



లావేరు మండలం ఉదయభాను స్వయం శక్తి సంఘం వారు తయారుచేసిన జూట్ ఉత్పత్తులు

డ్వాక్రా బజార్ చూసొద్దాం..

ఎక్కడ: శ్రీకాకుళం మున్సిపల్ మైదానంలో
సమయం: ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..
ఎప్పటి వరకు : ఈ నెల 9 వరకు



కోనసీమ జిల్లా ఆత్రేయపురం పూతరేకులు, మ్యాంగో జెల్లీ



మన్యం మన్యం పార్వతీపురం జిల్లా సీతంపేటకు చెందిన వారు ఏర్పాటు చేసిన న్యాచురల్ ఆర్గానిక్ ఉత్పత్తులు



విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన శ్రీ గాయత్రీ స్వయం శక్తి సంఘం వారు ఏర్పాటు చేసిన కొబ్బరి పాలు, కొబ్బరి నీళ్లు, కోల్డ్ ప్రెస్ ఆయిల్స్

భూతలం.. శీతలం

- రాత్రి వేళ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- అత్యల్పంగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- రానున్న రోజుల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం



దట్టంగా కురుస్తున్న పొగమంచు

ఆమదాలవలస రూరల్: జిల్లాపై చలిపులి పంజా విసురుతోంది. గత వారం రోజుల నుంచి ఎలాంటి చలిగాలులు లేవు. ఒక్క రోజులోనే సాధారణ ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల చలితీవ్రత పెరిగిందని కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ విభాగం శాస్త్రవేత్త మౌనిక 'సాక్షి'కి శుక్రవారం తెలియజేశారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం కాడడంతో సాయంత్రం నాలుగు గంటలు అయితే చాలు బయట తిరగడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం 9 గంటలు దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు. చలికి చల్లని గాలులు, మంచు తోడుకావడంతో మరింత అవస్థలు పడాల్సి వస్తోంది. జిల్లాలో సాధారణ ఉష్ణోగ్రతలు చూస్తే రాత్రి వేళ 14 డిగ్రీలు, పగటి పూట 27 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. నాలుగు రోజుల కిందట సాధారణం కంటే రాత్రి ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీల వరకు అధికంగా రికార్డయ్యేవి. దీంతో చలి తీవ్రత పెద్దగా కనిపించేది కాదు. ప్రస్తుతం పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటు చేసుకోవడంతో తగ్గుదల కనిపించడం వల్ల చలితీవ్రత పెరిగింది. రోజుకు 4 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల చలి ఎక్కువగా కనిపిస్తోంది. చలి తీవ్రత వారం రోజులపాటు పెరిగే అవకాశం ఉందని వివరించారు.

చల్లని గాలుల ప్రభావం ఎక్కువ

జిల్లాలో శీతల వాతావరణానికి తోడు గాలుల తీవ్రత ఉండడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. చలికి తగ్గట్టుగానే గంటకు 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడం వల్ల ఉదయం, సాయంత్రం, రాత్రి అన్ని వేళలా చలి బాగా పెరుగుతోంది. దీంతో వాహనాలపై ప్రయాణం చేసే వారికి ఇబ్బందిగా మారుతోంది. గత ఏడాదితో పోల్చి చూసుకుంటే ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువగా ఉంది. గత ఏడాది జనవరి 5వ తేదీన రాత్రి ఉష్ణోగ్రత 17, పగటి ఉష్ణోగ్రత 31 డిగ్రీలు ఉండగా ఈ ఏడాది రాత్రి ఉష్ణోగ్రత 14, పగటి ఉష్ణోగ్రత 27గా నమోదైంది. ఈ ఏడాది జనవరి నెలలో రాత్రి వేళ ఉష్ణోగ్రతలు 14 నుంచి 16 డిగ్రీల మధ్య కొనసాగడం వలన చలి యథావిధిగా కొనసాగుతుంది. సముద్రం వైపు నుంచి గాలులు వీస్తే ఉష్ణోగ్రతల్లో పెరుగుదల వచ్చి చలి తీవ్రత తగ్గుతుందని శాస్త్రవేత్త తెలిపారు. చలి తీవ్రత ఉన్నంతకాలం జిల్లాలో వర్షాలు పడే అవకాశాలు లేవు. దట్టంగా కురుస్తున్న పొగమంచు కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆస్తమా, గుండెజబ్బు రోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- మృతులు ఒడిశా వాసులు
- ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని ప్రమాదం



ప్రమాదానికి కారణమైన కారు



సంతోష్ కుమార్ దొర (ఫైల్)



కైలాస్ నాయక్ (ఫైల్)

టెక్కలి రూరల్: ఒక యువకుడికి ఆరు రోజుల కిందటే కూతురు పుట్టింది. కానీ అంతలోనే మృత్యువు అతడిని మింగేసింది. మరొకరు పొట్టకూటికి వలస వచ్చి బతుకుతుంటే.. అతడిని కూడా మృత్యుదేవత తీసుకెళ్లిపోయింది. టెక్కలి పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాలకు కన్నీరు మిగిల్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చూడా నగర్‌పూర్ పోస్ట్ పట్టపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఆర్.సంతోష్ కుమార్ దొర(32), కైలాస్ నాయక్(28) టెక్కలి మండలం ఆంజనేయపురం గ్రామ సమీపంలోని లీలాప్రసాద్ క్వారీలో గత కొంత కాలంగా పనిచేస్తున్నారు. వీరు తమ స్నేహితులతో కలసి క్వారీ సమీపంలోనే నివాసముంటున్నారు. వీరు ప్రతి రోజు ఉదయం 4గంటల సమయంలో కోటబొమ్మాళి మండలం శ్రీపురం సంతకు ద్విచక్రవాహనం పై కాయగూరల కోసం వెళ్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 4గంటల సమయంలో బైక్‌పై ఆంజనేయపురం నుంచి సంతకు వెళ్తుండగా ఒలెసాగరం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైన ఓ కారు వెనుక నుంచి వచ్చి వీరి బండిని ఢీకొట్టింది. ఆ ధాటికి బైక్‌పై వెళ్తున్న వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కారు ముందు భాగం కూడా పాడైపోయింది.

మృతుడు సంతోష్ కుమార్ దొరకు ఆరురోజుల కిందటే కూతురు పుట్టింది. ఊరికి వెళ్లి కుమార్తెను, భార్యను చూసి నాలుగు రోజుల క్రితమే ఇక్కడకు వచ్చాడు. అంతలోనే ఈ ఘటన జరిగింది. సంతోష్ మృతి వార్త తెలిసి కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదించారు. మరో వ్యక్తి కైలాస్ నాయక్‌కు తల్లిదండ్రులు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని అరావలి శిరీష్ ఒడిశా రాష్ట్రం అంగుర్ జిల్లా భారత్‌పూర్‌లో కోలిండియా కంపెనీలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తల్లిదండ్రులు విశాఖలో ఉంటున్నారు. తండ్రికి గుండె నొప్పి రావడంతో భార్యతో కలిసి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న టెక్కలి ఎస్ఐ–2 రమేష్ బాబు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాలను శవ పంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి, కారును స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ–2 తెలిపారు. అయితే మృతుని కుటుంబలకు న్యాయం చేయాలని కోరుతూ తోటి కార్మికులతో పాటు సమీప ప్రాంతం ప్రజలు స్టేషన్ ముందు ఆందోళన చేశారు.

'భువనేశ్వరి పరామర్శలు బూటకమే'



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

ఆమదాలవలస: నారా భువనేశ్వరి చేసిన పరామర్శలన్నీ బూటకమేనని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ కూన రవికుమార్, అక్కడ చంద్రబాబు చేస్తున్న శవరాజకీయంలో భాగమే ఈ పరామర్శలని విమర్శించారు. చంద్రబాబు జిల్లాకు ద్రోహం చేశాడే తప్ప మేలు ఇసుమంతైనా చేయలేదని గుర్తు చేశారు. వేర్వేరు కారణాలతో కాలం చేసిన వారి కుటుంబాలను పరామర్శించారని, ఆయా గ్రామాల్లోకి వెళ్లి స్థానికులను అడిగితే నిజం తెలుస్తుందని అన్నారు. ఎన్ని చేసినా కూన రవికుమార్ అవినీతిని ఆమదాలవలస నియోజకవర్గ ప్రజలు మరిచిపోరని, రానున్న ఎన్నికల్లో ప్రజల ఛీత్కారం తప్పదని చింతాడ అన్నారు. సమావేశంలో పార్టీ కార్యకర్తలు దానేటి రామోహనరావు, సంపతిరావు ప్రతాప్ కుమార్, అన్నెపు కృష్ణ, చింతాడ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ మెస్‌లో విధ్వంసం



రిమ్స్ మెస్‌లో బెంచీలు, కుర్చీలు విరగ్గొట్టి కోడిగుడ్లు పగలగొట్టిన దృశ్యం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలోని పురుషుల మెస్‌లో కొందరు వ్యక్తులు విధ్వంసం సృష్టించారు. కుర్చీలు, బెంచీలు పగలగొట్టి, కొంత వంట సామగ్రిని కూడా ధ్వంసం చేశారు. వందలాది కోడిగుడ్లు పగలగొట్టారు. ఈ ఘటనకు సంబంధించి భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు విద్యార్థులు భోజనాన్ని ప్లేట్లలో వేసుకుని హాస్టల్ గదులకు తీసుకువెళ్లడాన్ని, మెస్ ప్రతినిధులు అడ్డుకోవడంతో గొడవ ప్రారంభమైనట్లు సమాచారం. మరికొందరు దీనికి మతం రంగు కూడా పూస్తున్నారు. రిమ్స్ అధికారులు మాత్రం ఇది బయటవారి పనేనని అంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా సరైన వివరాలు లేకపోవడంతో వారు ఫిర్యాదు తీసుకునేందుకు నిరాకరించారు. రిమ్స్ అధికారులు ఉదాసీనతతోనే గత పది రోజులుగా రిమ్స్‌లో కొన్ని సంఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

151 మందికి ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య

నరసన్నపేట: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 151 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 324 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూల్లో పాల్గొనగా 151 మంది ఎంపికయ్యారు. వీరికి నియామక పత్రాలను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య అందించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు జగనన్న ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ఒక్క నరసన్నపేటలో వరుసగా ఐదేళ్ల జాబ్‌మేళాలు నిర్వహించి రెండు వేల మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. ఈ విధంగా జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల్లో కూడా జాబ్‌మేళాలు నిర్వహించి అర్హత కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ పీటీ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు వచ్చి సెలెక్టు కాని వారు జిల్లాలో తమకు దగ్గరలో ఉన్న స్కిల్ హబ్ ట్రైనింగ్‌లో చేరి వారి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. సెట్ శ్రీ సీఈఓ ప్రసాదరావు, జలుమూరు ఎంపీపీ వాన గోపి, నరసన్నపేట జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి బి.చంద్రమౌళితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

చిలకమ్మకు ఘనంగా నివాళి



సవర చిలకమ్మ(మంత్రిబుడి) స్మారకస్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మందస: భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన సవర చిలకమ్మ పోరాటం ఆదివాసీలకు దిక్సూచిలాంటిందని పలువురు వక్తలు అన్నారు. మందస మండలంలోని గిరిజన ప్రాంతమైన కొండలోగాంలో గిరిజన రైతాంగ సాయుధ పోరాటయోధురాలు, ఆదివాసీ వీరవనిత సవర చిలకమ్మ అలియాస్ మంత్రిబుడి 28వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది.

అఖిల భారత ఆది వాసీ వేదిక జాతీయ కమిటీ సభ్యురాలు ఎస్.జయలక్ష్మి, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీకాకుళ సాయుధ ఉద్యమ పోరాటంలో చిలకమ్మకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఉద్యమాల చరిత్రలో వీరగున్నమ్మ, ధీరచిలకమ్మ ధ్రువ తారల్లా నిలిచిపోతారన్నారు. ముందుగా చిలకమ్మస్థూపం వద్ద ఎర్రజెండా ఎగురవేసి, ఆదివాసీ సదస్సును ప్రారంభించారు. అనంతరం మంత్రిబుడికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ నాయకుడు గొరకల బాలకృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ప్రజాసంఘాల నాయకులు రాపాక మాధవరావు, కుత్తం హేమ, పి.మల్లిబాబు, బర్ల గోపి, జానకమ్మ, రాజులమ్మ, ఆదివాసీ నాయకులు ఢిల్లీరావు, కామయ్య, దశరథ, చంద్రశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంగరాజుపురంలో చైన్ స్నాచింగ్

మెళియాపుట్టి: మండలంలోని గంగరాజుపురం గ్రామానికి చెందిన వట్టికూల్ల రాజేశ్వరి అనే మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం దొంగిలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజేశ్వరి గ్రామ పంచాయతీ రహదారి పక్కన ఉన్న జగన్నాథపురం చెరువులో స్నానం చేసుకుని ఇంటికి వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న తులమున్నర పుస్తెలతాడును తెంపుకుని వెళ్లిపోయారు. అతను ఒడిశా జంగాలపాడు వైపు వెళ్లిపోయినట్లు రాజేశ్వరి తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

జేబుదొంగలకు దేహశుద్ధి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో జేబుదొంగలకు దేహశుద్ధి చేశారు. శుక్రవారం ఉదయానికి మాలధారణ అనంతరం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అరసవల్లి క్షేత్రానికి తరలి రావడంతో ప్రసాదాల కొనుగోలు క్యూలైన్ల వద్ద ఓ నలుగురు భక్తుల జేబుల నుంచి పర్సులు మాయమయ్యాయి. మరొకరి జేబులో పర్సును దొంగిలిస్తూ ఓ జేబుదొంగ దొరికేశాడు. దీంతో ఆ దొంగకు భక్తులు అక్కడే దేహశుద్ధి చేశారు. సుమారుగా ఒక గంటలోనే రూ.12 వేల వరకు చోరీకి గురైనట్లుగా గుర్తించారు. అయితే సీసీ కెమెరాలో పుటేజిని చూసిన తర్వాత వీరంతా ఒక గ్యాంగ్‌గా తిరుగుతున్నట్లుగా గుర్తించారు. దొరికిన దొంగకు దేహశుద్ధి చేస్తుండగా.. మరో దొంగ పరారయ్యాడు. వెంటనే స్థానిక హోంగార్డుల సహాయంతో వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించి అతడిని కూడా పట్టుకున్నారు.

దీనిపై ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ వద్ద ప్రస్తావించగా అన్నదాన, ప్రసాదాల కౌంటర్లతో పాటు సాధారణ క్యూలైన్ల వద్ద కూడా బందోబస్తును పెంచేలా పోలీసు అధికారులకు తెలియజేస్తామని వివరించారు. అలాగే ఆలయం తరపున కూడా సెక్యూరిటీ గార్డులను ప్రత్యేకంగా ఆయా విభాగాల్లో నియమిస్తామని ప్రకటించారు.

12న ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో ఈ నెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు స్థానిక వివేకానంద యువజన సంఘం వారు తెలిపారు. ప్రతి టీమ్‌లో నలుగురు సభ్యులు ఉండాలని, వయసుతో నిమిత్తం లేదని, భోజన సదుపాయం ఉందని, ప్రవేశ రుసుం లేదని, తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదేనని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని, 50 మార్కులతో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని, దీనిలో టాప్ 10 టీమ్స్ మెయిన్‌లో పాల్గొంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 9010303454, 9010902091, 9866581937 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.